క్లుప్తంగా

నేడు కార్తీక పౌర్ణమి

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని ప్రసిద్ధ దేవాలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం, సాయంత్రం లక్ష దీపార్చన, గాంధీనగర్ హనుమాన్ దేవాలయంలో లక్ష దీపార్చన, మీనాంబరం పరుషవేదీశ్వర ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా భాగ్యేశ్వరాలయం, సంతోషి మాత ఆలయాల్లో లక్ష దీపార్చన నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబుపేట: విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా మండలంలోని పలు ఫీడర్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవాబుపేట ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, గురుకుంట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, ఇప్పటూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, కొల్లూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తీగలపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మిడ్జిల్: సింగిల్‌విండో ద్వారా రైతులకు ఎనలేని సహకారం అందిస్తున్నట్లు వైస్‌చైర్మన్ అల్వాల్‌రెడ్డి అన్నారు. సహకార వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం మిడ్జిల్ సింగిల్‌విండో కార్యాలయం వద్ద జెండాను ఎగురవేశారు. సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీఈఓ బాల్‌రెడ్డి, బంగారు, బీరయ్య, శివ, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

రేపు ఈషా గ్రామోత్సవం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈ నెల 16న ఈషా గ్రామోత్సవం నిర్వహించనున్నారు. గ్రామోత్సవంలో భాగంగా పురుషులకు జిల్లాస్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించి, నగదు బహుమతులను అందజేయనున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 9వేలు, ద్వితీయ బహుమతి రూ. 6వేలు, తృతీయ బహుమతి రూ. 3వేలు, నాల్గో స్థానం జట్టుకు రూ. 2వేలు ప్రదానం చేయనున్నారు. అదే విధంగా జిల్లాస్థాయిలో విన్నర్, రన్నర్‌గా నిలిచిన జట్లు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. వాలీబాల్ పోటీలకు ఇప్పటికే 35 జట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రమేష్ (98851 48821)ను సంప్రదించాలని కోరారు.


మార్చురీ వద్ద మంటలు



జడ్చర్ల టౌన్‌: బాదేపల్లి ఆస్పత్రి పాత భవనం మార్చురీ వద్ద గురువారం రాత్రి చెలరేగిన మంటలు కలకలం రేపాయి. మార్చురీ గది వద్ద మంటలు, పొగలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. మంటలు రేగుతున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. గురువారం మార్చురీలో మూడు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అదే విధంగా కొంతకాలంగా మృతదేహాలకు సంబంధించిన దుస్తులు పేరుకుపోయాయి. పాత దుస్తులతో పాటు ఇతర కొన్ని వస్తువులకు ఆస్పత్రి సిబ్బంది నిప్పుపెట్టారు. అది తెలియని స్థానికులు మంటలు అంటుకున్నాయని, ఫ్రీజర్‌లు కాలిపోయాయని వదంతులను తెరలేపారు.

కొనసాగుతున్న సర్వే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఆరో రోజు గురువారం మొత్తం 49 వార్డుల పరిధిలో 4,830 ఇళ్ల వద్దకు 526 మంది ఎన్యూమరేటర్లు వెళ్లి కుటుంబ యజమానుల నుంచి పూర్తి సమాచారం సేకరించారు. కాగా, మొత్తం 78,696 ఇళ్లకు గాను ఇప్పటి వరకు 25,472 ఇళ్లను కవర్ చేశారు.





మిడ్జిల్ మండలం మున్ననూర్ పాఠశాలలో..



దేవరకద్ర మండలం వెంకటాయపల్లి పాఠశాలలో..



బాదేపల్లి హైస్కూల్లో..

ఘనంగా బాలల దినోత్సవం



లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్‌: జిల్లావ్యాప్తంగా గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో దివంగత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ బ్రహ్మ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల, శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జేజేబీ మెంబర్లు గిరిజా, గ్రేసీ, పాఠశాల వ్యవస్థాపకుడు గన్నోజు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్స్ సుజాత, శ్రీధర్ అంజనేశ్వరి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

- దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో జూనియర్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. వెంకటాయపల్లి పాఠశాలలో గూంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెక్కెరి రామాంజనేయులు విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సంస్థ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్, హెచ్‌ఎంలు కల్పన, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, జిల్లా న్యాయవిజ్ఞాన సమితి ప్రతినిధులు పుట్టపాగ రాధాకృష్ణ, యోగేశ్వర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, న్యాయవాదులు మాలిక్ షాకీర్, రాములు, పురుషోత్తం పాల్గొన్నారు.
- హన్వాడ మండలంలోని గొండ్యాల్, బుద్ధారం, పీర్లిప్పగడ్డ తండా, తిరుమలగిరి, కొనగట్టుపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు స్వెట్టర్లు, చాపలు, స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. బుద్ధా లైట్ ఇన్‌ర్నేషనల్ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇన్‌చార్జి వినరబుల్ చూమన్, అధ్యక్షుడు మాతాజీ ఉపెక్క, కార్యదర్శి బాలయ్య, నాగయ్య, ప్రవీణ్, బాలకిష్టయ్య, సుజాతబౌర, ప్రతిభారాణి, వడ్ల రాకేష్, రామలింగం పాల్గొన్నారు.
- మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ ప్రాథమిక పాఠశాలలో దాత మల్లికార్జున్‌రెడ్డి విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం విజయ, మాజీ సర్పంచ్ జంగయ్య, జైపాల్‌రెడ్డి, వెంకటయ్య, శివారెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంతో పాటు అల్లీపూర్, తిర్మలాపూర్ పాఠశాలల్లో విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- నవాబుపేట మండలంలోని పోమాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.శాంత జిల్లా డిస్కస్ త్రో జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు సత్కరించి అభినందించారు. వెంకట్రాములు, ఖాజమైనొద్దీన్, కృష్ణ, పాండు, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



హన్వాడ మండలం తిరుమలగిరి పాఠశాలలో..



చిన్నచింతకుంట మండలం తిర్మలాపూర్‌లో..

నెహ్రూ సేవలు చిరస్మరణీయం

స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల: దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకుమార్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, అజ్మత్‌అలీ, అవేజ్ అహ్మద్, ఫక్రుద్దీన్, బాలస్వామి, అక్బర్, ఖాదర్, బాలస్వామి, ఫహీం, తాహెర్, బాబుమియా, షాఫైసల్ పాల్గొన్నారు.

- జడ్చర్లలోని సిగ్నల్‌గడ్డలో నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ర్యాలీగా వచ్చి నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బూర్ల వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్, వెంకటేశం, గంగ్యానాయక్, బాలకృష్ణ, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోలీసుల త్యాగాలను గౌరవించాలి : ఎస్పీ



పరదేశినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ క్రైం: దివంగత ఎస్పీ పరదేశి నాయుడు పోలీసు కుటుంబానికి గర్వకారణమని.. విధుల నిర్వహణలో ఆయన చూపిన ధైర్యం ప్రతి పోలీసుకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ డి.జానకి అన్నారు. పరదేశినాయుడు వర్ధంతి సందర్భంగా గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా వన్‌టౌన్ చౌరస్తాలో ఉన్న పరదేశి నాయుడు విగ్రహానికి పూలమాలలు వేశారు. అమరులైన పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోలీసు త్యాగాలను గౌరవించాలని, సమాజంలో శాంతి స్థాపనలో తమ పాత్ర పోషించాలన్నారు. సమాజంలో నిత్యం శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసు అధికారుల పాత్ర కష్టసాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీలు సుదర్శన్, రమణారెడ్డి, ఏఓ రుక్మిణి, సీఐలు అప్పయ్య, శ్రీనివాస్, ఎస్‌ఐ శీనయ్య, పీఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రంగోత్సవ్ విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న బెక్కం జనార్దన్, మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని రేయిన్‌బో పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రంగోత్సవ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో మొత్తం 1,600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. జూనియర్ విభాగంలో మొదటి బహుమతి అపెక్స్ స్కూల్ విద్యార్థిని వర్షితకు రూ. 5వేలు, ద్వితీయ బహుమతి చైతన్య స్కూల్ విద్యార్థిని ఆఫియా ఫాతిమా రూ. 3వేలు, మూడో బహుమతి యూనివర్సల్ స్కూల్ విద్యార్థి లక్ష్మీప్రసన్నకు రూ. 2వేలు అందజేశారు. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి దక్ష స్కూల్ విద్యార్థి హురియా ఫాతిమాకు రూ. 5వేలు, రెండో బహుమతి ఢిల్లీ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థిని దీక్షితకు రూ. 3వేలు, మూడో బహుమతి మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ విద్యార్థిని సాయి నూతనకు రూ. 2వేలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది బెక్కం జనార్దన్, పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా ధాన్యం డబ్బులు జమ



మున్ననూర్‌లో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేష్

మిడ్జిల్: కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను జాప్యం లేకుండా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని మున్ననూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు ధాన్యం తరలించిన 48 గంటల్లో డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యంలో తాలు, మట్టిపెడ్డలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ సిద్దార్థ, ఏఈఓ ఫాతిమా ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం..

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లిలో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్ ప్రారంభించారు. అంతకుముందు జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డులో అమ్మకానికి వచ్చిన ధాన్యం, మొక్కజొన్నలను పరిశీలించారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, యాదగిరి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మహబూబ్‌నగర్ క్రీడలు: పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి ఆదిత్ నారాయణ్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థిని శాలువాతో సత్కరించి అభినందించారు. జాతీయస్థాయి టోర్నీలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతినందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రజత పతకం

మక్తల్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రంలో గురువారం జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 71 కేజీల విభాగంలో మక్తల్‌కు చెందిన వడ్ల జాహ్నవి సిల్వర్ మెడల్ సాధించి సత్తా చాటినట్లు కోచ్ సంపత్‌కుమార్ విలేకర్ల తెలిపారు. హైదరాబాద్ హకీంపెట స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్న జాహ్నవి వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతుంది. తాజాగా జాతీయస్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించి సత్తా చాటిందని తెలిపారు. ఈ విషయం తెలియడంతో జాహ్నవి కుటుంబసభ్యులకు బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



నేటి నుంచి లక్ష్మీనారాయణ ఆశ్రమ వార్షికోత్సవాలు



అఖండ హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్‌: మండలంలోని గంగాపురం వద్ద ఉన్న శ్రీమళయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం 20వ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పరమాత్మనంద గిరిస్వామి తెలిపారు. వేడుకల్లో భాగంగా గురువారం ఆశ్రమంలోని ఆంజనేయ స్వామి సన్నిధిలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా 108 మంది దంపతులతో శ్రీరుద్రసహిత శత చండీ యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. 1,008 సార్లు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, 108 కిలోల కుంకుమతో అమ్మవారికి కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, కార్తీక వనభోజనాలు, లక్ష దీపార్చన, లక్ష్మీనారాయణ, సీతారాముల, భ్రమరాంబికా మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 108 కలశాలతో ఆలయ వ్యవస్థాపకుడు దివంగత నిత్యశుద్ధానందగిరికి అభిషేకం, ఊరేగింపు ఉంటాయన్నారు. వేడుకల్లో భాగంగా 108 మంది పీఠాధిపతులతో 5 ఆత్మజ్ఞాన సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు శ్రీపీఠం కాకినాడ పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతి, ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానందగిరి, విజయవాడ అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి హాజరవుతారన్నారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆస్పత్రి కార్మికుల వేతనాలు పెంపు



కార్మికులతో కలిసి మాట్లాడుతున్న సురేష్

జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు జీఓ నం.60 ప్రకారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు సురేష్ తెలిపారు. గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్ డా. చంద్రకళ సమక్షంలో జరిగిన చర్చల వివరాలను ఆయన వెల్లడించారు. మూడు రోజుల క్రితం జీఓ నం.60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ నోటీసు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. వేతనాల కోసం వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కార్మికులకు ఇకపై ప్రతినెలా రూ. 11వేల వేతనం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని.. రూ. 8వేల బేసిక్ వేతనం నుంచి 25 శాతం పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లించేందుకు ముందుకు వచ్చారన్నారు. వేతనాల పెంపునకు కృషిచేసిన సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్‌ఎంఓ హరినాథ్, కార్మికుల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ యాదవ్, నర్సింహ్మ, శేఖర్, మల్లేష్, రాజేష్, వినయ్, నిర్మల, నవీన్, విజయలక్ష్మి, మణెమ్మ, అలివేల, నర్మమ్మ, స్వాతి, భార్గవి పాల్గొన్నారు.

లగచర్లలో 144 సెక్షన్ ప్రతిపక్ష పార్టీలకేనా?



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్‌: కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో పోలీసులు విధించిన 144 సెక్షన్ ప్రతిపక్ష పార్టీలకు మాత్రమేనా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లగచర్లలో అధికారులపై ఇటీవల జరిగిన దాడులను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని లగచర్లలో ప్రస్తుత పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్తున్న ఎంపీ డీకే అరుణను అడ్డుకున్న పోలీసులు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి అవకాశం కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లగచర్ల ప్రాంతంలో ఫార్మా కంపెనీల ఏర్పాటును వ్యతిరేకించడానికి గల కారణాలు, వారి ఇబ్బందులను సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకుల కుట్రపూరిత దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కోట కిరణ్‌కుమార్‌రెడ్డి, కిష్యానాయక్, యాదయ్య, ఎడ్ల కృష్ణయ్య ఉన్నారు.

ఎంపీని అడ్డుకోవడం దారుణం..

మిడ్జిల్: లగచర్ల గ్రామంలో సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న ఎంపీ డీకే అరుణను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ డీకే అరుణ తన నియోజకవర్గంలో పర్యటించకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాజేశ్వర్, పాండురంగారెడ్డి, తిరుపతి, నరేష్, శేఖర్, విష్ణు ఉన్నారు.



ఎన్‌హెచ్-44 ఫ్లైఓవర్ వద్ద నిలిచిన వాహనాలు

ట్రాఫిక్‌జాంతో అవస్థలు

మున్సిపాలిటీలోని 44వ నంబర్ జాతీయ రహదారి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం పలుమార్లు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఫార్మా సెజ్ కంపెనీలకు వెళ్లే వాహనాలు రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలపడం.. గడ్డి వాహనం రావడంతో ఒక్కసారిగా ట్రాఫిక్ జాం అయ్యింది. కొత్త బస్టాండ్‌వైపు పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అటు హైదరాబాద్ నుంచి మహబూబ్‌నర్ వైపు వెళ్లే మార్గం, మహబూబ్‌నగర్ నుంచి పట్టణంలోకి, హైదరాబాద్ వెళ్లే వైపు మార్గం వాహనాలతో నిండిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటలకు మరోసారి ట్రాఫిక్ జాం అయ్యింది. కొన్ని వాహనాలు నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా రావడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. - జడ్చర్ల టౌన్‌

నంచర్ల గేట్‌లో వెలసిన ఆంజనేయస్వామి విగ్రహం



నంచర్ల గేట్ వద్ద వెలిసిన ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్ల గేట్ క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి ఆంజనేయ స్వామి విగ్రహం వెలిసింది. గురువారం తెల్లవారుజామున అటుగా శ్రీశైలం వెళ్తున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకొని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అయితే ఇతర వ్యక్తులకు చెందిన ప్లాట్లలో కావాలనే ఆంజనేయస్వామి విగ్రహం పెట్టారని కొందరు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాత్రం అక్కడ ఎవరికి సంబంధించిన ప్లాట్లు లేవని.. అది గతంలో ఉన్న పాత ఆర్‌అండ్‌బీ రోడ్డు అని ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నంచర్ల గేట్ క్రాస్‌రోడ్డు సమీపంలో నివాసగృహాలు ఉన్నాయని.. ఇక్కడ ఆంజనేయస్వామి దేవాలయం అవసరమని గ్రామస్తులు తెలిపారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా ఆలయ నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. కాగా, ఈ విషయంలో పోలీసులు, ఉన్నతాధికారులు గ్రామస్తులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘు, వెంకటయ్య, కృష్ణ, చెన్నయ్య, భీమయ్య, కృష్ణయ్య, అంజిలయ్య పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



జడ్చర్ల టౌన్‌: పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో గురువారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీకమాసం విశిష్టత, దీపోత్సవంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో దీపాలు వెలిగించారు.